భగవాన్ ఏమి చెప్పారు అంటే దక్షిణామూర్తి శిష్యులకు బోధించి, బోధించి మౌనం వహించాడు, ఆ మౌనంలో వారికి వస్తువు స్ఫురించింది అన్నారు భగవాన్.

నిజమైన భక్తులు నిర్మలంగా ఉంటారు, కూల్‌గా ఉంటారు, వారు పని చేస్తూ ఉంటారు గాని పని చేస్తున్న జాడ కనబడదు. ఈ పని నా వల్ల అయ్యింది అని చెప్పేవాడు భక్తుడు కాదు. నువ్వు ప్రయత్నం చేసావు, దానికి ఈశ్వరుడు అనుగ్రహించాడు. అది ఈశ్వరుడి వల్ల అయ్యిందికాని నీ వల్ల కాదు. నిజమైన భక్తుడివలన మీకు ఏదైనా ఉపకారం జరిగినా నా వలన జరిగింది అని అనుకోడు, ఎందుచేతనంటే నేనే చేసాను అని చెప్పటానికి అక్కడ నేను లేడు, నేను లేనప్పుడు నేను చేసాను అని ఎలా చెపుతాడు, ఆయనే చేసాడు అంటాడు. భగవాన్ ఇంకా దూరం వెళ్ళి చెప్పారు. ఓ అరుణాచలేశ్వరుడా! నీ పేరు విని, నిన్ను స్మరించి ఇక్కడకు వచ్చాను. వచ్చి నిన్ను చూసాక తెలిసింది ఏమిటి అంటే నేను లేను, నువ్వూ లేవు అని తెలిసింది. నాది జీవుడి వేషం, నీది దేవుడి వేషం, ఈ వేషాలు తీసేస్తే ఉన్నది ఒక్కటే. అది బ్రాహ్మీస్థితి. భక్తుడు ఈశ్వరుడి స్వాధీనంలో ఉంటాడు, భక్తుడి శరీరాన్ని భగవంతుడు ఉపయోగించుకొంటాడు అంతే. ఇప్పుడు ఈ పుస్తకం నా స్వాధీనంలో ఉంది. దానిని పూజిస్తే నన్ను పూజించావు అని అనదు, దానిని కింద పడేసాను అనుకోండి నన్ను కింద పడేసావు అని ఏమీ అనదు. కింద పడేసినప్పుడు ఎలా ఉంటుందో, దానిని పూజించినప్పుడు అలాగే ఉంటుంది. అలాగే భక్తుడి శరీరం, మనస్సు ఈశ్వరుడి స్వాధీనంలో ఉంటాయి. ఆయన ఎక్కడ కూర్చోబెడితే అక్కడే, ఏ పని చేయిస్తే అదే, తను అంటూ అక్కడ లేడు, ఉన్నది ఈశ్వరుడే, అంతా ఆయనే, అటువంటి భక్తి కుదరాలి, దానికి ఎంతో పూర్వపుణ్యం ఉండాలి.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 13-08-2009, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు కృష్ణాష్టమి. కృష్ణుడు మధురలో జన్మించాడు. మనందరం తల్లికడుపులో నుండి వచ్చాము. కాని కృష్ణుడు అందరి మనుషులు లాగ పుట్టలేదు. ఆయన మధురలో జైలులో పుట్టినవాడివలె కనిపించాడు. మహావిష్ణువే దేవకీదేవి దగ్గర కృష్ణుడి రూపం ధరించాడు. కృష్ణుడిని పరిపూర్ణావతారం అంటారు. అంటే భగవంతుడికి ఎన్ని కళలు ఉన్నాయో అన్ని కళలతోటి జన్మించినవాడు కృష్ణుడు. దేవకీ వసుదేవులకు వివాహం అయిన

తరువాత కంసుడు ఇంటికి తీసుకొనివెళుతూఉంటే నేనే రాజుని అని అనుకొంటున్నావు, నీతోబుట్టువు అష్టమగర్భంలో నిన్ను చంపేవాడు పుడతాడు అని కంసుడితో అశరీరవాణి చెప్పింది. అప్పుడు కంసుడు దేవకిని చంపటానికి కత్తి తీస్తాడు. వసుదేవుడు ఏమని చెప్పాడు అంటే నీతోబుట్టువును చంపవద్దు, పిల్లలు పుట్టగానే ఆ పిల్లలను నీకు ఇచ్చేస్తాము వారిని నువ్వు చంపేయి అని చెప్పాడు. మీరు ఎక్కడో ఉంటే పిల్లలను చంపటం ఎలా కుదురుతుంది అని అప్పడు దేవకీవసుదేవులను జైలులో పడేసాడు. పిల్లలు పుడితే వరుసగా కంసుడికి ఇచ్చేవారు, కంసుడు వారిని చంపేసేవాడు అష్టమగర్భం వచ్చేటప్పటికి కృష్ణుడు దర్శనమిచ్చాడు, అక్కడ పుట్టిన వాడి వలె కనిపించాడు. ఆయన వసుదేవుడితో ఏమని చెప్పాడు అంటే నన్ను గోకులంలో నందుడి ఇంటిలో ఉంచు, అక్కడ ఉన్న యోగమాయను తీసుకొని వచ్చి ఇక్కడ ఉంచు అని చెప్పాడు. వసుదేవుడు కృష్ణుడిని తీసుకొని వెళుతూ ఉంటే అప్పడు యమునానది వరదలతో ఉంది. నదిని దాటటం ఎలాగ అని అనుకొంటూ ఉంటే అప్పడు యమునానది ఆయనకు దారి ఇచ్చింది. కొంచెం దూరం వచ్చాక నది పెరగటం ప్రారంభించింది, వీడిని ముంచేయటానికి కాదు, కృష్ణుడి పాదాలను ముద్దుపెట్టుకోవాలని నదికి అనిపించింది. కృష్ణుడి పాదాలను ముద్దుపెట్టుకొన్నాక మరల అణిగిపోయింది. కృష్ణుడిని తీసుకొనివచ్చి నందుడి ఇంటిదగ్గర ఉంచి అక్కడ ఉన్న యోగమాయను తీసుకొనివెళ్ళి దేవకి దగ్గర ఉంచాడు. అష్టమగర్భంలో అమ్మాయి పుట్టింది అని బటులు వెళ్ళి కంసుడికి చెప్పారు. అప్పడు యోగమాయను తీసుకొనివచ్చి చంపటానికి పైకి ఎగరవేసాడు కంసుడు. కిందపడకుండా పైకి ఎగిరిపోతూ యోగమాయ ఏమని చెప్పింది అంటే ఓరేయ్ నేనుకాదు, నిన్ను చంపేవాడు పుట్టేసాడు, గోకులంలో పెరుగుతున్నాడు, వాడి చేతిలో నువ్వు చనిపోతావు, నిన్ను ఎవరూ రక్షించలేరు అని చెప్పి మాయమైపోయింది. అప్పడు గోకులంలో ఉన్న పిల్లలను చంపటానికి రాక్షసులను పంపాడు. పూతన అనే రాక్షసి వచ్చి తన స్థనాలకు విషం రాసుకుని యశోదతో పిల్లవాడికి పాలు ఇస్తాను అని చెప్పింది. కృష్ణుడు ఏమి చేసాడు అంటే పాలు తాగాడు, తాగాడు తరువాత దాని రక్తం కూడా తాగేసాడు, అప్పడు పూతన చనిపోయింది. పిల్లవాడిగా ఉండగానే గోకులంలో చాలామంది రాక్షసులను చంపాడు.

యశోద కృష్ణుడిని గోవిందా, దామోధర, మాధవ అని పిలిచేది. మనం కూడా ప్రాణం శరీరాన్ని విడిచిపెట్టిపోయేటప్పడు గోవిందా, దామోధర, మాధవ, నారాయణ అని

స్మరించుకొంటే మనకు మోక్షానికి అర్హత కలుగుతుంది. మనం హృదయంలో పనికిరాని గొడవలు అన్నీ మోస్తూ ఉంటాము, అందుచేత ప్రాణంపోయే టైములో ఆ గొడవలే జ్ఞాపకం వస్తాయి కాని మనకు దేవుడు జ్ఞాపకం రాడు. మనకు రోజూ రాత్రి బుల్లి చావు వస్తుంది. అంటే మనం నిద్రలోనికి వెళ్ళినప్పుడు దానిని బుల్లిచావు అంటారు. నిద్రలో మనకు ఏమీ తెలియదు. అందుచేత నిద్రపోయినవాడు చనిపోయినవాడితో సమానం అంటారు. మనం నిద్రలోనుండి లేచినప్పుడు అదే శరీరంలో లేస్తాము, చనిపోయాక అయితే ఇంకో శరీరంలో లేస్తాము అందుచేత నిద్రను బుల్లిచావు అంటారు. ఈ చిన్నచావుకు ముందు రోజూ నామం ప్రాక్టీసు చెయ్యండి. పెద్దచావు వచ్చినప్పుడు అదే వస్తుంది. కృష్ణుడు వెన్నదొంగిలించాడు అంటే దాని అర్థం మీ మనస్సు వెన్నపూస అంత మృదువుగా అయితే మీ మనస్సును ఆయన దొంగలించి ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు, అదీ వెన్నపూస దొంగతనం అంటే. కృష్ణుడు చెప్పేది ఏమిటి అంటే మీ డబ్బును, బంగారాన్ని ఇంట్లో పెట్టుకోండి. మీ మనస్సులో డబ్బును, బంగారాన్ని మొయ్యవద్దు, మనస్సులో భగవంతుడిని మొయ్యండి, మనస్సులో భగవంతుడిని పెట్టుకోండి.

నేను అనే తలంపు, నాది అనే తలంపు ఈ రెండు తలంపులే మనిషిని పాడు చేస్తున్నాయి. ఎవడు పాపం చేసినా, దోషం చేసినా ఈ రెండు తలంపులే కారణం. ఈ రెండు తలంపులు ఉన్నంతకాలం పైకి పెద్దమనుషులకింద కనిపించినా పాపాలు చేయకుండా, దోషాలు చేయకుండా ఎవడూ ఉండలేడు. మనలో ఉన్న దోషాలను తొలగించటానికే మహావిష్ణువు రాముడి రూపంలో, కృష్ణుడి రూపంలో వచ్చాడు. మనం వారిని స్మరిస్తే చాలు మనలో ఉన్న దోషాలను బయటకు తోలేసి మనలను పరమపవిత్రులుగా చేస్తారు. అందుచేత మనం రాముడిని స్మరించినా, కృష్ణుడిని స్మరించినా మనం తరిస్తాము. సీతమ్మ లంకలో అశోకవనంలో ఉన్నప్పుడు ఆంజనేయస్వామి అక్కడకు వెళతాడు. అప్పుడు సీతమ్మ రాముడి వియోగంలో ఉంది. ఆంజనేయస్వామి చూస్తున్నప్పుడు రాముడికి దూరంగా ఉన్న సీతమ్మ ఎలా ఉందో వాల్మీకి చెపుతాడు అంటే భగవంతుడికి దూరమైన జీవుడు ఎలా ఉంటాడో వాల్మీకి ఇక్కడ వర్ణిస్తాడు. సీతమ్మ ఎలా ఉంది అని వాల్మీకి చెప్పాడు అంటే నీరు లేని చెరువులాగ ఉంది, సూర్యగ్రహణం రోజున సూర్యుడు ఎలాగ ఉంటాడో అలాగ ఉంది, డబ్బుకోసం ఎదురుచూస్తూ ఎన్నాళ్ళకు డబ్బు అందకపోతే వాడి మొఖం ఎలాగ ఉంటుందో అలాగ ఉంది, నిందలు మోస్తున్న కీర్తిమంతుడిలాగ ఉంది, పూజ శ్రద్ధగా చేస్తూ ఉంటే ఏ

కారణం వలన అయినా ఆ పూజ మధ్యలో ఆగిపోతే వారి మొఖాలు ఎలా ఉంటాయో సీతమ్మ అలా ఉంది అని చెప్పాడు. ఇవన్నీ సీతమ్మను వంపుపెట్టుకొని మనకు చెపుతున్నాడు.

మన మనస్సులో కల్మషం ఉండటం వలన మనకు భక్తి యొక్క విలువ తెలియటం లేదు. మనస్సులో ఉన్న కల్మషం మనకు భగవంతుడి పాదాల యందు గౌరవం కలగనివ్వదు. ఇది మహామాయ. పామునోట్లో ఉన్న విషం పామును చంపదు. అది ఎవరిని కరిస్తే వారిని చంపుతుంది. అలాగే భగవంతుడిలో ఉన్న మాయ ఆయనను ఏమీ చేయదు. ఆ మాయలో తగులుకొన్నవారందరూ మసి అయిపోతారు. మనం భగవంతుడి పాదాలను ఆశ్రయిస్తే, భగవంతుడి స్వాధీనంలో మాయ ఉంది కాబట్టి ఆ మాయ మనకు దారి ఇస్తుంది, మనం భగవంతుడిలో ఐక్యమవ్వటానికి మాయ ప్రక్కకు తప్పకొంటుంది, రామకృష్ణుడి తల్లి చనిపోయిన తరువాత ఆ శవానికి నిప్పపెట్టేముందు ఆవిడ పాదాలకు నమస్కరించి రామకృష్ణుడు ఒక విచిత్రమైన మాట చెప్పాడు. నేను నీ కడుపున పుట్టానమ్మా, నేను ధన్యుడను అని ఆయన అనలేదు, నువ్వు నన్ను కన్నావు కాబట్టి నువ్వు ధన్యురాలవమ్మా అన్నాడు అంటే ఈ శరీరంలో భగవంతుడిని కడుపులో మోసావు కాబట్టి నీవు ధన్యురాలవు. కృష్ణుడి రాసలీలలు గురించి చెపుతారు, అప్పుడు ఆయన వయసు ఐదేళ్ళు. ఐదేళ్ళ పిల్లవాడికి కామక్రోధాలు ఏముంటాయి. ఇందులో రహస్యం ఉంది. మన హృదయంలో ఉన్న శత్రువులు కామక్రోధములు, ఇవి జన్మజన్మల నుండి మన కూడా వస్తున్నాయి. కృష్ణుడి తత్వం మీకు అర్థమైతే, ఆయన రాసలీలలు చదివి ఆనందించగలిగితే మీలో ఉన్న కామక్రోధములు సమూలంగా నాశనమవుతాయి.

బాగుపడాలనుకునేవారు, ఆధ్యాత్మికంగా జీవితం గడపాలనుకునేవారు భాగవతం చదవండి. భాగవతం చదివినప్పడు కృష్ణుడి మీద ప్రేమ పుట్టకుండా ఆగదు, కృష్ణుడిని ప్రేమించకూడదు అని మీరు అనుకొన్నా కృష్ణుడిని ప్రేమించకుండా ఉండలేరు. కర్మ ఏడుస్తూ చెయ్యకు, యజమానిలాగ చెయ్యి అని పరమాత్మ చెప్పాడు. మనకు ఉద్యోగం అంటే ఇష్టమే, జీతం అంటే ఇష్టమే కాని పని అంటే ఇష్టం ఉండదు. ఉద్యోగం దొరకాలి, జీతం వచ్చేయాలి, పని చెయ్యకూడదు. పని ఏడుస్తూ చెయ్యకు, ఇష్టంగా చెయ్యి, బాధ్యతగా చెయ్యి. మనకు ఎంతోకొంత భక్తి ఉంది అనుకొంటున్నాము. గోపికలు కృష్ణుడితో ఏమన్నారు అంటే మా దగ్గర ప్రేమ ఏమి ఉంది, మేము మొద్దులం, నువ్వే మాకు ప్రేమ ఇచ్చావు, నువ్వు ఇచ్చిన ప్రేమతో ప్రేమించబడుతున్నావు, ఇందులో మాది ఏమీ లేదు నీ పట్ల భక్తిని నువ్వు మాకు

ప్రసాదించకపోతే నీ పట్ల మాకు భక్తి ఎలా కలుగుతుంది, ఈ జీవలక్షణాలతో బతుకుతున్న మాకు అది సాధ్యమా కృష్ణా అన్నారు గోపికలు. మాకు భక్తి ఉంది, దేవుడియందు ప్రేమ ఉంది అని మనం అనుకొంటున్నాము కాని గోపికలకు ఉన్న బుద్ధి మనకు లేదు. కృష్ణుడు అతి బలవాన్. ఆయన మిమ్మల్ని చంపాలి అనుకొన్నాడు అనుకోండి, ఆయనకు ఆయుధాలు అక్కరలేదు. ఏమ్మా బాగున్నావా అని ఇలా చెయ్యి వేసాడు అంటే చనిపోతావు. కృష్ణుడి దగ్గర ప్రమాదం ఏమిటి అంటే మీరు ఆయనకు ఏది ఇస్తే అది మనకు తిరిగి వచ్చేస్తుంది. మీరు కృష్ణుడికి ఒక పైసా ఇస్తే మీకు వెయ్యి పైసలు వచ్చేస్తాయి. ఒకసారి ధర్మరాజు కృష్ణుడితో ఏమన్నాడు అంటే నాలో ఏమైనా దోషాలు ఉంటే నీకు ఇచ్చేస్తాను అన్నాడు. అప్పుడు భీముడు ఏమన్నాడు అంటే ఎప్పడూ అలా చెయ్యవద్దు, ఆయన మాయావి. ఏదో బావ బావ అని తిరుగుతున్నాడు అని ఆయన వలలో పడకు. నీలో ఉన్న నాలుగు దోషాలు ఆయనకు ఇచ్చావు అనుకో మరల వెయ్యి రెట్లు వచ్చి నీమీద పడతాయి, నువ్వు మొయ్యలేవు. ఈ నాలుగు దోషాలు ఏముంది, ఏదో అనుభవిస్తే పోతాయి అని చెప్పాడు.

కృష్ణం వందే జగద్గురుం. కృష్ణుడు కేవలం ఒక ప్రాంతానికి గురువు కాదు, జగత్తుకంతా గురువు. మనం కృష్ణుడిని ఎంతసేపు దేవుడిగానే చూస్తాము కాని గురువుగా చూడము. ఆయన ఎంత గొప్ప దేవుడో అంత గొప్ప గురువు కూడా. కృష్ణుడిని మధురకు తీసుకొని రావటానికి కంసుడు అక్రూరుడను పంపిస్తాడు. బృందావనం నుండి కృష్ణుడిని తీసుకొని పోవటానికి అక్రూరుడు వస్తే గోపికలు వాడిని పట్టుకొని తిడతారు. వీడు మాతోటి ఆడుకొంటున్నాడు, వీడిని మాకు దూరం చేస్తున్నావు ఏమిటి? నీకు ఆ పేరు ఎవరు పెట్టారు నీవు క్రూరుడవేగాని అక్రూరుడవుకాదు, పరమాత్మను మాకు దూరం చేస్తున్నావు అంటారు గోపికలు. అంటే వారు కృష్ణుడిని బాహ్యంగానే చూస్తున్నారు. కృష్ణుడు ఎవరు? ఆయన మనలో అంతర్యామిగా ఉన్నాడు. కృష్ణుడుని మన హృదయంలో దర్శించాలి. ఎప్పుడైతే భగవంతుడిని మనలో అంతర్యామిగా దర్శించామో అది మన కడసారి జన్మ. అయితే కామక్రోధముల నుండి విడుదల పొందకుండా ఆయనను దర్శించటం సాధ్యం కాదు. ఒక మంచివాడు కృష్ణుడితో అన్నాడు అందరూ నన్ను గుణవంతుడు అంటున్నారు, నాలో మంచి గుణాలు ఉన్నాయి అని నాకు తెలుస్తోంది. ఓ మాధవా! ఎందుకు నాకు ఈ మంచి గుణాలు, ప్రజలు చెప్పకోవటానికా? నీలో ఐక్యం అవ్వటానికి సహకరించని ఈ మంచిగుణాలు నిజంగా మంచిగుణాలేనా, ఇవి నాకు ఎందుకు కృష్ణా అంటాడు, అదీ గొప్పతనం. మీరు

మంచివారు అని ఎవరైనా మనతో అంటే పొంగిపోతాము. కాని ఇక్కడ ఏమి చెపుతున్నాడో చూడండి నీలో ఐక్యం కావటానికి పనికిరాని గుణాలు నాకు ఎందుకు కృష్ణా అంటున్నాడు, ఎంత సుప్రీంగా చెపుతున్నాడో చూడండి.

కృష్ణుడు ఒకసారి కుంతీదేవితో అమ్మా నీకు ఏమి కావాలి అని అడిగాడు. నాకు ఎప్పుడూ కష్టాలు ఇయ్యి వాసుదేవా అని చెప్పింది. నువ్వు కష్టాలు కోరుకొంటున్నావు ఏమిటి అని అడిగాడు. కష్టాలు అనుభవిస్తే ఆ మనిషి పరమపవిత్రుడు అవుతాడు, నిన్ను తెలుసుకొనే యోగ్యత కలుగుతుంది అని చెప్పింది. ప్రారబ్ధాన్నిబట్టి మీకు ఎవరికైనా కష్టాలు వస్తే వాటిని ఇష్టంగా కనుక అనుభవిస్తే మీరు స్వచ్ఛమైపోతారు, భగవంతుడిలో ఐక్యమవ్వటానికి మీకు అర్హత కలుగుతుంది. పరమేశ్వరుడు ఏమి చేసాడు అంటే కామాన్ని బూడిద చేసాడు, కాలాన్ని తన్నాడు. కాలం వలన చావు వస్తుంది, కామం వలన పుట్టుక వస్తుంది. ఈ రెండింటిలో నుండి నువ్వు బయట పడాలంటే ఈ రెండింటిని తన్ని విడిచిపెట్టిన పరమేశ్వరుడి పాదాలను ఆశ్రయించు అని జీవుడికి బోధిస్తున్నాడు. వాసనలోనుండి తలంపులు వస్తాయి. తలంపులలో నుండి సందేహాలు వస్తాయి. వాసనారాహిత్యం పొందేవరకు ఆత్మస్థితిని పొందలేడు. ఆత్మస్థితి కలిగేవరకు మంచిని చెడ్డ అనుకొంటాము, చెడ్డను మంచి అనుకొంటాము, ఏదో రకమైన సందేహం మనిషిని పీడిస్తూ ఉంటుంది, భయం పీడిస్తుంది, అనుమానం పీడిస్తుంది, వేదన పీడిస్తుంది, చనిపోయిన తరువాత జీవితం ఎలా ఉంటుంది అని భయం కలుగుతుంది, ఆత్మస్థితిని పొందిన తరువాత ఇంక సందేహాలు ఉండవు. కృష్ణుడు చివరి రోజులలో ఉద్ధవుడికి భక్తి గురించి చెప్పాడు. మామూలుగా మనం జ్ఞానం గొప్పది అనుకొంటాము కాని భక్తి రుచి తెలిసాక జ్ఞానం కూడా అక్కరలేదు అనిపిస్తుంది, అది పరాభక్తి. జరాసంధుడు కృష్ణుడిమీదకు వస్తే ఆయన పారిపోయేవాడు కాని జరాసంధుడిని చంపటానికి ఒప్పకోలేదు. ఈ మాయను అర్థం చేసుకోండి. జరాసంధుడి ప్రారబ్దం ప్రకారం వాడు భీముడి చేతిలో చనిపోవాలి. ఈయన చంపకూడదు, ఆ ప్రారబ్దాన్ని గౌరవించటానికి ఆయన జరాసంధుడితో యుద్ధం చేయలేదు.

భాగవతంలో రంతిదేవుడి చరిత్ర నాకు బాగా ఇష్టం. శరీరాన్ని ప్రారబ్దానికి వదిలేసిన వాడు రంతిదేవుడు. ఏ ప్రారబ్దం అనుభవించటానికి ఈ దేహం వచ్చిందో ఆ ప్రారబ్దమే ఈ దేహాన్ని పోషిస్తుంది అని ఆయన నమ్మకం. రంతిదేవుడికి సంతోషం వస్తే పొంగిపోలేదు,

ఏదైనా కష్టం వస్తే కుంగిపోలేదు. ఎందుచేతనంటే సంతోషం వచ్చినా, కష్టం వచ్చినా ఏదైనా ప్రారబ్ధాన్ని బట్టి వచ్చింది నాకేమీ సంబంధం లేదు అన్నాడు. దేహాన్ని ప్రారబ్ధానికి వదిలేసి ఆయన హాయిగా ఉన్నాడు, వాడు రంతిదేవుడు. కృష్ణుడు ఈ భూమిమీద 120 సంవత్సరాలు ఉన్నాడు. అన్ని పాత్రలు పోషించాడు. ఆయన యుద్ధాలు చేసాడు, జ్ఞానం గురించి బోధించాడు, భక్తి గురించి చెప్పాడు, రాయబారిగా ఉన్నాడు. ఇలా అనేక రకాలుగా పనిచేస్తూ కూడా తాను తానుగానే ఉన్నాడు, అదీ ఆయన గొప్పతనం. ఎంతో వైవిధ్యం ఉన్న పాత్రలు పోషించాడు, ఏదో చెట్టుకింద కూర్చొని శాంతిగా ఉండటంకాదు, భారతయుద్ధం జరుగుతున్నప్పడు కూడా శాంతిగా ఉన్నాడు. కర్మరంగంలో, యుద్ధరంగంలో కూడా నువ్వు శాంతిగా ఉండగలిగితే అది నిజమైన స్థితి.

అత్తలేనికోడలు ఉత్తమురాలు, కోడలు లేని అత్త ఉత్తమురాలు. అత్తలేదు కాబట్టి అది ఉత్తమురాలుగా కనిపిస్తోంది, అత్త ఉంటే దాని మజాకా తెలుస్తుంది. ఎంతమంది కోడళ్ళు ఉన్నా, ఎంతమంది అత్తలు ఉన్నా, నీవు ఏ రంగంలో ఉన్నా నీ శాంతి చెదరకూడదు, అది నిజమైన శాంతి. ఇంట్లోవారు అందరూ నిన్ను పీక్కు తింటున్నారు అనుకో అప్పడు కూడా నీ శాంతి చెదరకూడదు. గోపికలు కృష్ణుడిని ప్రేమిస్తున్నారు, ఆత్మగా ప్రేమించటంలేదు, ఒక శరీరంగా ప్రేమిస్తున్నారు, వారికి దేహాభిమానం పోలేదు, అది కృష్ణుడు గమనించాడు. గోపికలు ఒకరోజు చెరువులోనికి దిగి స్నానాలు చేస్తున్నారు. గట్టుమీద పెట్టుకొన్న బట్టలను కృష్ణుడు తీసుకునిపోయి చెట్టు ఎక్కి కూర్చున్నాడు. మీ బట్టలు ఇవ్వను అని ఆయన అంటాడు, మేము చెరువులో నుండి బయటకు రాము అని గోపికలు అంటారు. కృష్ణుడు అల్లరివాడు, కొంటెవాడు ఈయనను పూజించమంటున్నారు అని మీకు అనిపిస్తుంది. మనం ఎవరము అంటే ఆత్మ, కాని మనం దేహాన్ని ఆత్మ అనుకొంటున్నాము, దేహబుద్ధి మనకు పోవటంలేదు. గోపికలు భక్తులేగాని స్త్రీ పురుషబేధం వారికి పోలేదు. ఆత్మానుభవం పొందిన తరువాతగాని స్త్రీపురుషబేధం పోదు. ఆత్మకు శరీరం లేదు. శరీరం ఉంటే సెక్స్ కాని శరీరం లేనివాడికి సెక్స్ ఏమిటి? నేను బట్టలు ఇవ్వను అని ఆయన అంటాడు, మేము బయటకు రాము అని గోపికలు అంటారు ఇలా కొంతసేపు ఘర్షణ జరిగాక గోపికలు నీటిలో నుండి బయటకు వచ్చి చేతులు పైకెత్తి కృష్ణా మా బట్టలు మాకు ఇచ్చేయి అన్నారు. అంటే ఆ రకంగా వారికి దేహాభిమానాన్ని పోగొట్టి వారికి బట్టలు ఇచ్చేసాడు, ఆరకంగా గోపికలకు మహోన్నతంగా

చైతన్యస్థాయిని పెంచేసిన తరువాత బట్టలు ఇచ్చేసాడు, వాడు కృష్ణుడు. సెక్స్ భావనను ఓవర్‌కమ్ చేయించటానికి ఎంత ప్రక్రియ చేసాడో చూడండి, వాడు పరమాత్మ. ఇది సామాన్య మానవుడు చేసేపని కాదు. వాడు అల్లరివాడు కింద మీకు కనిపించవచ్చు, మీకు ఎలా కనిపించినా ఆయన పరమాత్మ.

మనకు దేవుడు అంటే ఇష్టం ఉండదు, మన శవాలంటే మనకు ఇష్టం. మన శరీరానికి స్నానం చేయించటం, దానికి అన్నం పెట్టటం, శరీరం అందరికీ అందంగా కనిపించేలా మంచి బట్టలు వేసుకోవటం ఇలా ఎంతసేపు ఈ శవం చుట్టూ తిరుగుతున్నాము కాని దేవుడి చుట్టూ తిరగటంలేదు. మనకు ఉన్న దేహబుద్ధిని పోగొట్టటంకోసం మన ఇంద్రియాలను, మనస్సును పిండుతాడు, వాడు దేవుడు. పుట్టినదానికి ప్రారబ్దం, పుట్టనిదానికి ప్రారబ్దం ఏమిటి? నువ్వు ఆత్మ అయి ఉన్నావు. ఆత్మకు పుట్టుకలేదు శరీరం పుట్టింది, అది నువ్వు కాదు. ప్రారబ్దం ఎవరికి అంటే శరీరానికే ప్రారబ్దం. అది నువ్వు కాదు అని తెలిసినప్పడు ప్రారబ్దం నిన్ను దెబ్బలు కొట్టలేదు. దూడను కట్రాడుకు కట్టేస్తే, అది తెంపుకొనిపోయింది అనుకో ఇంక యజమాని కూడా దానిని ఏమీ చేయలేడు అలాగే దేహాభిమానం పోయినవాడిని ఈశ్వరుడు కూడా ఏమీ చేయలేడు, ఆ స్టేజికి ఎగిరివెళ్ళిపొమ్మంటున్నాడు. గోపికలకు ఉన్న దేహాభిమానాన్ని పోగొట్టటానికి కృష్ణుడు వారి బట్టలను దొంగలించాడు. వేలాది సంవత్సరాలు తపస్సు చేస్తేగాని కొంతమందికి దేహాభిమానం పోదు. వేలాది జన్మలు తపస్సు చేసి పోగొట్టుకోలేని దేహవాసనను, కామవాసనను కొన్ని క్షణాలలో తీసేసాడు, హృదయంలో మోస్తున్న బంధాలను ఏదో నెపం పెట్టి బయటకు లాగేసాడు, వాడు పరమాత్మ. సూర్యచంద్రులకు వెలుగును ఎవడు ఇస్తున్నాడో వాడే మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు. భగవంతుడిని మన హృదయంలో పెట్టుకొని ఆయనకోసం దేశం అంతా తిరుగుతున్నాము. మన స్వరూపంలో సుఖం ఉంది, శాంతి ఉంది, ఆనందం ఉంది. అది తెలియకపోవటం వలన సుఖం కోసం, శాంతికోసం బజారులో వెతుక్కుంటున్నాము.

ఈ మధ్యన ఒక భక్తుడు ఏమి చెప్పాడు అంటే దేవుడి సంకల్పాన్ని నా సంకల్పం చేసుకొన్నాను, దేవుడి ఇష్టాన్ని నా ఇష్టం చేసుకొన్నాను అప్పటి నుండి సుఖపడుతున్నాను నాన్నగారు అని చెప్పాడు. నీ ఇష్టమే నా ఇష్టం, నీ సంకల్పమే నా సంకల్పం అని దేవుడితో చెపుతున్నాను, ఈ మాటలు నోటితో అనటంకాదు, లోపల ఆ నిర్ణయానికి వచ్చేసాను,

అప్పటినుండి సుఖంలో ఓలలాడుతున్నాను అని చెప్పాడు. భవిష్యత్‌లో దుఃఖం తీసుకొని వచ్చే ఆలోచనలు చెయ్యకండి, భవిష్యత్‌లో దుఃఖం తీసుకొని వచ్చే పనులు చేయకండి, భవిష్యత్‌లో మీకు దుఃఖం తీసుకొని వచ్చే స్నేహాలు చేయకండి. సజ్జనసాంగత్యం ఎందుకు అంటే ఏ హృదయంలో అయితే అంతర్యామి ఉన్నాడో అక్కడ మనస్సు స్థిరపడటానికి సజ్జనసాంగత్యం అవసరం. సత్పురుషులతో సహవాసం వలన మనస్సు నిర్మలమవుతుంది, మనస్సు పవిత్రమవుతుంది, మనస్సుకు లోచూపు కలుగుతుంది. మనస్సుకు లోచూపు కలిగి దాని మూలంలోనికి అది ఉపసంహరింపబడినప్పుడు మనస్సు నశిస్తుంది, అప్పుడు ఆత్మజ్ఞానం కలుగుతుంది. కొంతమంది ఇంట్లోవారి మీద విపరీతమైన మమకారం పెట్టుకొంటారు. వారికి కడుపు నొప్పి వస్తే వీరికి వచ్చింది అంటారు, వారు ఏడిస్తే వీరు ఏడుస్తారు, అంత మమకారం పెట్టుకొంటారు. మమకారం నీకు క్షోభ తెచ్చిపెడుతుంది. నువ్వు పని చెయ్యి మమకారం పెట్టుకోవద్దు.

బలవంతంగా నువ్వు ఏ పని చెయ్యవద్దు. నువ్వు కర్మకు యజమానిగా ఉండు, బానిసగా ఉండవద్దు. ఏదో ఋణసంబంధం అండీ, ఏదో చాకిరీ చేస్తున్నాము అని ఇలా ఏడుస్తూ ఎంతకాలం పనిచేస్తావు అంటున్నాడు కృష్ణుడు. కృష్ణుడు చెప్పేది ఏమిటి అంటే మీరు చేసే పని మీరు మోక్షం పొందటానికి సహకరించాలి అంటే ఎలా పని చేస్తే మీకు మోక్షం కలుగుతుందో అలా పనిచెయ్యటం నేర్చుకోండి అని పరమాత్మ చెపుతున్నాడు. కర్మను యోగంగా చేయండి. మనం ఏ పని చేస్తున్నామో ఆ పని కనబడాలి, మనం కనబడకూడదు. మీరు ఏదైనా మంచి పని లోకానికి చేసారు అనుకోండి, ఆ పని లోకానికి కనబడవచ్చు కాని మీరు కనబడకూడదు. ఆ పని నేను చేసాను అనే తలంపు అసలు లోపల ఉండకూడదు. కృష్ణుడు చెప్పే కర్మ రహస్యం ఏమిటి అంటే మీరు పని ఎలా చెయ్యాలి అంటే పని జరుగుతూ ఉండాలి అక్కడ నేను కనబడకూడదు, ఆ పని పూర్తి అయ్యేటప్పటికి ఈ నేను కూడా పోవాలి. ఈ నేను పోయిన తరువాత ఉన్నది బ్రహ్మమే. మనం ఎలా చేస్తాము అంటే ఆ పని పూర్తి అయ్యేటప్పటికి నేను పెరిగిపోతుంది, మీ అనుభవంలో చూసుకోండి. గోపికల భక్తి ఎంత పరాకాష్టకి వెళ్ళిపోయింది అంటే మాకు ముక్తి వద్దు, భక్తే చాలు అంటారు. అంటే వారు భక్తిలో ఎంత సుఖాన్ని, ఆనందాన్ని అందుకోవాలో అంత సుఖాన్ని, ఆనందాన్ని అందుకొంటున్నారు.

| సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు | | |
|---|---|---|
| సెప్టెంబర్ | 13 | శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు |
| సెప్టెంబర్ | 23 | హైదరాబాద్ సత్యసాయి నిగమ్ (సద్గురు శ్రీ నాన్నగారి పుట్టినరోజు) |

# ఆశకోసం బ్రతకకూడదు - ఆశయం కోసం బ్రతకాలి

కీర్తి తృష్ణ తరచు మానవుణ్ణి సత్య పథం నుంచి దూరం చేస్తుంది మనం వస్తువులను భోగించాలని కోరుకొంటాము. భోగాశక్తి ఆత్మకు లేదు అహంకారానికే. జీవించటానికై ఆశ పడకూడదు. మరణించటానికై భయపడకూడదు. సంతుష్టుడై జీవించాలి. గొప్పవాన్ని కావాలని ఎప్పడూ కోరుకోకూడదు. మనం ధర్మ తత్పరులము కావాలంటే ఆశలను, కోరికలను జయించాలి. మమత ఎప్పడూ పరాయి వస్తువులమీద ఉంటుంది. ప్రేమ తనపై ఉంటుంది. ఎలా అంటే శరీరం మనది కాదు. ప్రపంచ వస్తువులు మనం కావు మనం వైరు - శరీరం వేరు మనకై వాటిని కోరుకొంటాము ఇది అంతా మనస్సుచేసే గారడీ. కనీసపు అవసరాలకోసం దొరికిన దానితో తృప్తిపడేవాడే భాగ్యవంతుడు. ఇనుపగొలుసులకంటే ఆశ ధృఢమైనది. ఎలా అంటే ఇనుప గొలుసులు కాల ప్రవాహంలో క్షయించిపోతాయి. కాని ఆశ ఇంకా వృద్ధి అవుతుంది. ఎక్కడ ఆశలు ఉంటాయో అచ్చట బండపాశాలు, దుఃఖరాసులు ఉండి మహాబాధను కలిగిస్తాయి. మనం అనుసరించదగ్గది ఒక్కటే మార్గము. ఆశపరిత్యాగమే. ఎంత సంతోషస్థితిలో కూడా నిర్లిప్తత కోల్పోకూడదు. మనః ప్రశాంతిని వీడరాదు. మన ఆశయాలు, ఆకాంక్షలు అన్ని పిచ్చివే, పరధ్యానంలో గుడ్డిగా ఏర్పరుచుకొన్నవే వాటికి విలువలేదు. ఆశ అనేది నల్లమందులాంటిది. అది మనలను మత్తులోనూ, భ్రాంతిలోనూ ఉంచి మన జీవితాన్ని అందుల్లోకి జారిపోయేలా చేస్తుంది. మరి చావు వచ్చి తలుపు తట్టేసరికి అంతా మించిపోతుంది. కాబట్టి మనోగతమైన సకల ఆశల యందు కక్కిన అన్నమునందు ఎట్టి బుద్ధి ఉంటుందో అట్టి బుద్ధి ఉండాలి. దుష్ట సంకల్పములు గలవాడు కక్కినకూటిని తిన్న కుక్కతో సమానమని విచారించాలి. అట్టి విచారణ వల్లనే ముక్తి లభిస్తుంది. "శాశ్వతమైన సత్యాన్వేషణమే జీవితం" అంటోంది యజుర్వేదం. "ఆశలుడుగగాని పాశముక్తుడు కాడు; ముక్తుడైన గాని మునియుగాండు; మునియైనగాని మోహంబులుడుగవు" అన్నారు వేమన. కాబట్టి కైవల్యమే మన జీవిత ఆషయమని నమ్మి ఆచరిస్తే సొమ్ము. నమ్మకపోతే దుమ్ము అంతే.

- **సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్ధవరం

# జ్ఞాన విజ్ఞాన యోగం

భగవంతుని శక్తి సర్వత్ర ప్రసరిస్తున్నది. ప్రకృతిలో అన్ని శరీరాల ద్వారా జరిగే ప్రతి కార్యం భగవంతుని విలాసమే. ఒక్క మానవులకే స్వేచ్ఛ ఉంది. మనలోని ఆలోచనలు, కోర్కెలు కూడ భగవత్ప్రేరణలే. శరీర భావముతో స్వార్థపరులమై ఇతరులకు హాని కల్గిస్తుంటాం. భగవద్భావం పెంచుకుంటే మంచిగా మారగలం. మనలో సత్త్వ రజస్తమో గుణాలున్నాయి. సత్త్వగుణం కొందరిలో, రజోగుణం కొందరిలో, తమోగుణం కొందరిలో ఎక్కువగా ఉండవచ్చు. ఈ గుణాలను నియంత్రించుకుని, నిస్వార్థంగా పనులు చేస్తుంటే మన కోరికలు హానికరంగా మారవు. జీవితం ఉన్నతమవుతుంది. ద్వేషం దరిచేరనీయక పరోపకార దృష్టి అలవరచుకోవాలి. ఈ త్రిగుణాలు మన ఉపకరణాలు అని గ్రహించి వాటిని మన సేవకులుగా వాడుకోవాలి. వీటిని నియంత్రించుకుని అరిషడ్వర్గాలను జయించిన వారే మహాపురుషులందరు. కోపము బలహీనపరుస్తుంది. సహనము, క్షమ చాలా అవసరము. క్షమ చేతకానివాని లక్షణం కాదు. శక్తి కలిగి ఉండి క్షమ ప్రదర్శించడం ఉత్తముల లక్షణం. మోహము మరియొక దుర్గుణం. మోహమనగా విపరీతమైన ఆకర్షణతో ప్రలోభపడడం. భగవద్భావంతో క్రోధం, మోహం వంటి అరిషడ్వర్గాలను జయించవచ్చు. త్రిగుణాలు మన అభివృద్ధి కొరకే ఇవ్వబడ్డాయి. వాటికి లొంగిపోయి జీవించడం అజ్ఞానం. జ్ఞానాన్ని విజ్ఞానంగా మార్చుకొనగల శక్తి మనకున్నది. అజ్ఞానం చాలా శక్తివంతమైనది. అది మనలను కిందికి లాగడానికి ప్రయత్నిస్తుంది. దానిని జయించటానికి ధైర్యం, పట్టుదల అవసరం. దానికి దైవభావం సహాయం చేస్తుంది. ధైర్యంతో ముందుకు సాగాలి. అప్పడే ఈ సమస్త నామ రూపాల వెనుక ఉన్న దివ్యత్వాన్ని గుర్తించగలం. మనలను మనమే ఉద్ధరించుకోవాలి. ఈ ప్రయత్నానికి భగవంతుని సహాయం తప్పక లభిస్తుంది. ప్రతి మతము ఇదే బోధిస్తుంది. భగవద్భావంతో జీవితం ఉన్నతపరచుకొనే విధానం నిర్దేశిస్తుంది. మత లక్ష్యం మరచిపోయి కర్మకాండలు పూజలలో కాలం గడుపుతూ అదే మత జీవితం అనుకొంటున్నారు. జీవిత ధ్యేయం ప్రాపంచిక సుఖాలనుభవించడం కాదు. కారాదు. ఆత్మజ్ఞానంతో స్వభావ సంస్కరణ ముఖ్యం. మత గ్రంధాలను పవిత్రమని పూజించటం కాదు, వాటిలోని జ్ఞానం గ్రహించి సాధనతో, ధ్యానంతో జీవితం సంస్కరించుకోవాలి. మనలోని త్రిగుణాలు, అరిషడ్వర్గాలు, పరిసరాల ప్రభావం మనలను ప్రక్కలకు లాగి దారి తప్పించాలని ఎప్పడూ ప్రయత్నిస్తుంటాయి. వీటినెదుర్కొని అనుకూలంగా మార్చుకోగల శక్తి మనకున్నది. మన నిజ తత్త్వం దైవత్వం అని గ్రహించినప్పడు దేహభావాలను, ప్రకృతిశక్తులను సమర్థంగా ఎదుర్కొనగలం. మహాత్ముల జీవితాలు మనం సరైన మార్గంలో నడవడానికి సహాయం చేస్తాయి. వారి జీవితాలలో వెల్లడైన భగవతత్త్వం విలాసం గ్రహించడం, మనం కూడా మన జీవితాలను ఆ విధంగా భగవత్ శక్తి సహాయంతో సంస్కరించుకోవటం మానవ జీవిత లక్ష్యం.

- సిలువేరు సుదర్శన్, హైదరాబాద్

---

**మతం బహుముఖమైనది. ఒక్కొక్క జాతి ఒక్కొక్క అంశాన్ని గ్రహించి అదే సమగ్రమనుకొంటుంది.**

**- బ్రహ్మానంద కేశవచంద్రసేన్**